# నా భార్య



"విశాలహారి"

'అటుచూడు సునీ! ఆ సూర్యాస్తమయం ఎంత చూడ ముచ్చటవుతుందో! ఎఱుపు, పసుపు విడివడని నవదంపతుల్లా కలిసి పోయి సిగ్గుపడుతూ విసిలాకాశం నుండి కొండల తెరమరగుకి ఒరిగిపోయి చీకటి రాత్రిని వెతుక్కుంటున్నాయి. సృష్టి చిత్రకారుడు తన రంగులన్నీ కలిపి క్రింద ఒలకబోసికొన్నట్లుంది గదూ!'

'మల్లెల మాలలా తెల్లని కొంగల బారు వాటి మధ్యనుండి ఎలా మంద గమనంతో తమ గూళ్ళకి పోగిపోతున్నాయో!' అంటే చూస్తుండి పోయాడతను. ఆమె కూడా అటువేపు అమాయికంగా చూస్తోంది.

తన భుజానికానుకుని అలా బయటికి చూస్తున్న ఆమెను చూస్తుంటే అనిర్వచనీయమైన ఆనందానుభూతిని పొందుతున్నాడతను. ముంగురులు గాలి తాకిడికి వెనక్కి విసురుగా తన చెంపలను రాసుకుంటూ విసురుతూవుంటే అతనిలోని ప్రత్యణువు గుగుర్పొడిచింది. నున్నటి ఎత్తయిన గులాబి బుగ్గలు, నవనవలాడుతూ మధురాన్ని చిందించే ఎర్రటి పెదవులు, నునుపైన చిన్న గడ్డం మీద నల్లటి చుక్క అతనిలోని కోరికలను రేపి దీర్ఘ నిశ్వాసను విడిపింప జేసినాయి.

ఆ వేడినిట్టూర్పుతో అతని వంక చూచి వింతగా మత్తుచూపులు చూస్తున్న అతనినుండి సిగ్గుతో తల దించుకుంది.

ఆమె మౌనాన్ని సహించలేక, 'అలా సిగ్గుపడతావేంటి? మనల్నిచూసి ఎవరయినా ఏమన్నా అనుకుంటారేమోనవా? చూడనీ మనకేం! వాళ్ల జీవితంలోనూ యిటువంటి దొర్లిపోయిన రోజుల్ని జ్ఞాపకం చేసుకుంటారు!' అని అన్నాడతను.

బుగ్గలు సిగ్గుతో పొంగి ఎరుపెక్కాయి. అమాయికంగా అతని కళ్లల్లోకి చూసి, దగ్గరగా జరిగి అతనిలో యిమిడిపోతున్నట్లు అతని భుజానికి తలను ఆనించుతూ వుండిపోయింది గోముగా.

పందెం వేసుకున్నట్లు చెట్లన్నీ వెనక్కి గెత్తి పోతున్నాయి. పచ్చటి పైరులు గాలికి మోజులు వంచి వూగుతూ వుంటే, చేటిమీద తెల్లనిబాటలు పరుగెత్తుతున్నాయి. వెనక్కు పోతున్నబాట గతంలా వుంది. ముందున్న బాటమాత్రం వంకరగా వుంది.

బస్సు కుదుపుతో ఆమె అతని మీదపడి సిగ్గుతో తలవంచుకుంది.

ఆమెలో నాగరీకం కన్నా పల్లెదనం యింకా కొట్టొచ్చినట్లు కనుపిస్తుంది. ప్రతిదాన్నీ వింతగా చూస్తుంది. బస్సులో మిగతా వారి దృష్టి వారి మీదనే వున్నది మధ్య మధ్య వారిచూపుల నెదుర్కొని ఆమె తన చూపులను క్రిందికి దించుకుంటూ వుంది. చూసే వాళ్లందరికీ నవదంపతులు మొదటి యాత్ర చేస్తున్నారని పిస్తుంది.

వాళ్లనుకునేది నిజమే! వాళ్లు కొత్త దంపతులు! తొలిదినాలలోని కొత్తదనం కనిపిస్తుంది. అందుకే ఆమె చూపులు క్రిందికి దించుకుంటూ వుంది. కానీ అతని సాహచర్యాన్ని వాంఛిస్తూ అతన్ని అంటిపెట్టుకుని దగ్గరగా జరిగి కూచొంది.

అతనికింకేమీ మాటలాడటానికి తోచక 'మీవూరునుండి బయటి కదుగుపెట్టడం

యిదేననుకుంటాను. అవునా?'

నవ్వి వూరుకుంది, అవునన్నట్లు.

మళ్లీ ఒక్క కుదుపు యిచ్చింది బస్సు. అతని ఒడిలోకి తూలిపోయింది. అతన్ని చూసి చిన్నగా నవ్వి తలవంచుకుంది అతనూ నవ్వాడు.

'వుయ్యాల వూగటం అంటే చిన్నప్పుడు సరదగా వుండేది. మనల్నిద్దర్నీ ఈ కుదుపు వుయ్యాలూపినంత ఆనందం యిచ్చింది. మనకి ఎంతో హాయిగా వుంటే వెనుకసీట్లో కూచున్న ముసలి వారికి ప్రాణసంకటంగా వుంది. మనస్సు సంతోషంగా వుంటే ఎటువంటి బాధనయినా యిట్టే తేలికగా తీసుకోగలంగదూ! చూడు మనకంటికిపుడు ప్రపంచమంతా రంగులు రంగులుగా కళకళ లాడుతూ వున్నట్లుగా కనిపిస్తుంది చెట్లఆకులు, పువ్వులు పతులు మనల్ని చూసి నవ్వుతూ వికసించినట్లు, పాడుతున్నట్లు మనకోసమే సృష్టించబడినట్లుగా వున్నాయి. ఆ పైకొచ్చే చంద్రుడెవరికోసం? మనకోసమే ననిపిస్తుంది గదూ!'

వింత సంతృప్తితో వూహాలోకంలోంచి బయటపడి ఆమెవంక చూసి, 'యిదంతా దేని మహిమంటావ్?'

'ఏమిటి? నాకు తెలియద'న్నట్లు అతని కళ్లల్లోకి చూసింది.

'మనం ప్రేమించి, ప్రేమించబడినపుడు ప్రపంచమంతా అనురాగంతో వెల్లివిరిసినట్లు కనుపిస్తుంది' అని అన్నాడతను.

నిజమే ననిపించిందామెకి. తనకు తెలియని విషయాలెన్ని తెలుసో ఆయనకు! మనసులో వూహ వున్నా మాటల్లో పెట్టడం తనకి చేతగాదు! మురిసిపోయిందామె మనసులో. వింతగా చూసిందతనివైపు.

అతని కన్నుల్లో వెలుగు తన జీవితానికి మార్గదర్శి కాగలదన్న ఆశ జనించింది. ముఖం తేజస్సుతో విప్పారినట్లుంది. అయితే గుబురయిన కొనలుదేరిన మీసాలు గంభీరతతో వింతసౌందర్యాన్నిచ్చింది. మెలిదిరిగిన కండలు వేసుకున్న స్లాక్ క్రిందనుండి బయటికి కనిపిస్తూ ఆ భుజాలమీద వాలిపోయి యీ ప్రపంచాన్నే మరచి పోదామనిపింప జేస్తున్నాయి.

'ఇప్పుడు బస్సు ఆగేచోట భోంచేయాలి మనం. ఎందుకంటే యింటికెళ్లిన తర్వాత యీ రాత్రికి వంటకు అవీ యివీ వెతుక్కో వలసి వస్తుంది. అక్కడ ఒక్కళ్లకి భోజనం రూపాయి పావలా!'

'రూపాయి పావలా!' ఆశ్చర్యపోయింది. 'రూపాయి పావలా వుంటే యింట్లో యిద్దరికి వండుకోవచ్చునే!' అని అనుకుంది.

అదేదో పెద్ద బస్తీలా వుంది. అన్నీ లైట్లే! ఎంత వెలుగో! పగలులా వుంది. ఒక పెద్దహోటలు ముందు బస్సు ఆగింది. ఆశ్చర్యంగా చూసింది. 'ఎంతపెద్ద భవనమో!'

అందరూ క్రిందికి దిగి హోటల్లోకి వెళ్తున్నారు.

'లే! దిగు!' అంటూ లేచాడతను.

'బస్సు వెళ్లిపోతుందేమో!' అని అంది

'మనం భోంచేసి వచ్చేంతవరకూ ఎక్కడికీ పోదు!' అని అన్నాడు. ఆ మాటలో బస్సు మనదేనన్న ధ్వని విన్పించింది. 'భోంచేసి వచ్చేంతవరకూ కదలదన్న మాట!' ఆశ్చర్యంగా చూసిందామె అతని వంక.

తిన్నగా కౌంటరు దగ్గరకెళ్లి పర్సుతీసి పదిరూపాయలనోటు యిచ్చాడతను. అతడు చిన్న పుస్తకంలోంచి రెండు పచ్చటి కాయితం ముక్కలు చింపి కొన్ని నోట్లు చిల్లర యిచ్చాడు.

ఒక గదిలోకి వెళ్లడంతోనే గోడకి వున్న కుళాయి క్రింద తెల్లగావున్న పింగాణిపళ్లెం చూసి విస్తుపోయింది. దానిపైన గోడకి అద్దం బిగించి వుంది. కుళాయి తిప్పి నీళ్లు వస్తుంటే చేతులు కడుక్కున్నాడతను. ఆమెకూడా అలానే చేసింది. కుళాయి అని చేతిగుడ్డతో చేతులు తుడుచుకుంటూ అద్దంలో చూసుకున్నాడతను. కొంగుతో చేతులు తుడుచుకుని, అద్దంలో ముఖం చూసుకుని, చెమట తుడుచుకుంది.

ఒక టేబులు దగ్గర చుట్టూ నాలుగు కుర్చీలు వేసి వున్నాయి కూచోగానే, తెల్లటి బట్టలు వేసుకున్నతను వచ్చి, అతని దగ్గరున్న పచ్చటి కాయితం ముక్కలు తీసుకున్నాడు. యింకోతను వచ్చి అరటాకులు వేశాడు. ఇంకొకడు కూరలు, యింకొకడు అన్నం వడ్డించాడు. అతను వెళ్లిన తర్వాత యింకోడు వచ్చి నెయ్యి, అప్పడాలు వేసి వెళ్లిపోయాడు.

'వడ్డించటానికి ఎంతమందో!' అన్నట్లు వింతగా చూసిందామె. పెళ్లివాడు వడ్డించినట్లుగా వుంది భోజనం!

'అమ్మ వుంటే ఎంత సంతోషించేదో! కళ్లు తెరవక ముందే తండ్రి గతించటంతో, నా అన్న దిక్కులేక మామయ్య యింటికి రాబట్టి, చివరికేనాడు ఎలాగైనా చెర విడిపించుకుందామని యీ యాయనకిచ్చి చేశాడు. తను అదృష్టవంతురాలు! ఎంతో ఆదరంగా, ఆప్యాయంగా చూసుకుంటున్నారు ఆయన.'

'ఏమిటాలోచిస్తున్నావు? తిను గబగబా. అందరూ లేచి వెళ్తున్నారు' అని అన్నాడు రంగనాథం.

అయిష్టంగా నాలుగు మెతుకులు తిని అలా వదిలి వేసింది!

బస్సు బరువుగా మెల్లగా బయలుదేరింది. దీపాలు, వెలుగు, బస్తీ వెనక్కి పోతున్నాయి. చీకటిని చీల్చుకుంటూ బస్సు ముందుకు సాగింది.

'యింకా ఎంత దూరమండీ?' అని అడిగింది సునీత.

అతను మాటలాడలేదు. బస్సులోని లైటు కాంతిలో అతని ముఖం పాలిపోయి వుంది. యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు పరధ్యానంగా వున్నాడు. వినిపించుకున్నట్లు లేదు. వుదాసీనంగా వున్నాడు.

ఇందాకటి వుత్సాహం యింతలోనే మాయమవటంతో కొంచెం కలత చెందింది. 'ఏమండీ!' అని చిన్నగా చేత్తో కదిలించింది.

'ఊఁ!' అన్నాడు తడబడుతూ.

'అలా వున్నారేమండీ?' ఆతృతగా అడిగింది.

'ఏమీ లేదు...!' అని వూరుకున్నాడు.

ముఖంమీద చిందుతున్న చిరు చెమట దీపపు వెలుగులో ముత్యాల్లా మెరుస్తూ వుంది. చిన్నగా వణుకు ప్రారంభమయింది. తన్ను తాను నిలవరించుకుంటానికి చాల ప్రయత్నించాడు. అయినా ముఖం మీదకు ఆ రేఖలు ప్రస్ఫుటంగా వస్తున్నాయి.

ఆమె వైపు తిరిగి చూశాడు. తన్ను చూసి ఖంగారుపడుతున్న ఆమెను చూసి, చిరునవ్వు చిందించాడు. కానీ దానిలో జీవం లేదు. 'ఏమిటలావున్నావ్?' అని అడిగాడామెని.

'నేనెలా వున్నాను? బానే వున్నానం'ది—ఆశ్చర్యంగా,

బయటి చీకటిలోకి చూస్తూ మాటలాడకుండా కూచున్నాడు. తను దిగవలసిన వూరు దగ్గరవుతున్న కొలదీ, భయం ఎక్కువయిందతనిలో. ప్రక్కనున్న తన భార్య తన్నుచూసి ఏమనుకుంటుందో నన్న ఆలోచన కలిగేటప్పటికి, ధైర్యాన్ని తెచ్చుకుంటున్నాడు గానీ, ఆమెముందు ఏమీ దాయలేక పోతున్నా డనిపిస్తుంది.

*　　　*　　　*

చీకటి పడేవేళకి రచ్చబండ దగ్గర పొలాలనుండి యింటికి పోతున్నవారూ, శెట్టి అంగడి దగ్గరికొచ్చిన వాళ్ళూ చేరుతుంటారు. కోమటిసుబ్బయ్య కొట్లో పెట్రోమాక్స్ లాంతరు ఆ చుట్టుపక్కల చాలా దూరంవరకూ కాంతి కొడుతుంది వీధి దీపాలు గాలికి ఆరుతూ, వెలుగుతూన్నట్లు గుడ్డి వెలుగునిస్తాయి.

నలుగురైదుగురు రచ్చబండ దగ్గర చేరారు. నల్లటి వూరకుక్క ఒకటి అరుగుమీద ముసుగాళ్ళలో తల పెట్టుకు పడుకుని వుంది. మధ్య మధ్య కళ్ళు తెరుస్తూ చూస్తూ, వాళ్ళమాటలు వింటూ వున్నట్లుగా చూస్తూ వుంది.

నోట్లోవున్న చుట్ట తీసి, తడితో నానిపోయిన చివరిముక్క కొరికి, తుపుక్కున వుమ్మేసి, 'రామయ్యా! రంగనాథం వస్తున్నాట్టగా!'

'ఏ రంగనాథం? రౌడీ రంగనాథమేనా?'

'ఆఁ! ఆడే! ఎవరు చెప్పారు నీకు?'

# నా భార్య

'సూరిగాడు, రామిగాడు లేడో, వాడన్నాళ్ళ!'

'అవునుగానీ, రాగవయ్యా! కొండడికీ, రంవాడికీ యేదో తగవొచ్చిదంటగా!'

'పోలయ్యకి తెలుసనుకుంటాను. ఏం జరిగింది పోలయ్యా? నీకు తెలుసనుకుంటాను.'

'ఏముంది బావా! రంగనాథం రైతుబిడ్డయినా, తల్లీ దండ్రీ యెనకెవరూ లేపోయేసరికి యీయ్యనదుపులో పెట్టేవోళ్ళే లేకపోయిరాయే! అసలు చిన్నప్పట్నుంచి రౌడీ స్నేహాలే గాదటయ్యా అన్నీ! అయ్య పేరేమన్నా నిలబెట్టేడేంటి? ఆయనెటువంటి మారాజు! చెడబుట్టాడు! ఆ కొండిగాడు గూడెంలో లేడో. మాదిగోడు...' అని యింకా యేదో చెప్పతుండగా—

దూరంగా కుక్కలు మొరిగాయి. ఒక్కసారే అన్నికుక్కలు మొరగటం, ఆ వూరివారందరికీ పెద్దగుర్తు! 'వస్తున్నాడు కొండడనే!'

రచ్చబండమీద కుక్కమాత్రం చెవులు రిక్కించి, తనకెందుకన్నట్లు, చూడనట్లు మునిగాళ్ళలో తలపెట్టుకుని చూస్తూ కూచుంది, అలవాటయిన మొరుగుడికి యిపుడు తన అవుసరం ఏమిటని.

రామయ్య నోట్లో చుట్ట అలానే జారిపడిపోయింది. చూసుకోలేదు. తీసుకోటానికి ప్రయత్నించ లేదు. అరుగు దిగి, పంచెగ దోసుకుని పక్కసందు పట్టాడు. పోలయ్య ప్రక్కనున్న కర్రబట్టుకుని; 'వేనొస్తాను బాబో!' అంటూ లేచాడు.

'ఒక్కముక్క చెప్పి పోవయ్యా! బాబు గదూ!' అంటూ పట్టుకున్నాడు ప్రక్కనతను.

'లేవయ్యా బాబూ ముందక్కణ్ణుంచి. పొడిచి పారేస్తాడు. ఒక చేతిలో కత్తి, ఇంకో చేత బుడ్డీ వుంటుందాడికి. కంటబడితే చాలు వదిలిపెట్టడు' అంటూ ముందుకు పాగుతూ వుంటే వెనుకతను గుంజాడు చెయ్యిబట్టుకుని.

'అంత భయమెందుకయ్యా నీకు!'

'నీకు తెలియదు నాయనా! వాడంటే అందరికీ హడల్! వాడు వూరింట్లోంచి బయటికి రాడు. వచ్చాడంటే ఎక్కడో ఖూనీయే! తప్పకుండా ఎవణ్ణో ఒకణ్ణి కనుపించినోణ్ణి పొడిచి మరీ పోతాడు. తర్వాత నీయిష్టం!' అంటూ చెయ్యి గుంజుకుని ముందు కడుగువేశాడు.

'పోలీసు లేమయ్యారయ్యా!' అంటూ అడిగాడు అతని చేయిబట్టుకుని.


'వాళ్ళకందితేగా అసలు. ముందుగానే వాసొస్తుంది. అంతే! ఈ రచ్చబండ దగ్గరిటువంటి ఖూనీలెన్ని జరగలేదు!' అంటూ గబగబా అడుగు వేశాడు.

బావిదగర్గర నీళ్ళు తోడుతున్న ఆడవాళ్ళు కడవలు, కుండలు నీళ్ళు నింపుకున్నా నింపుకోపోయినా ఎక్కడోళ్ళక్కడే అలానే తీసుకు వెళ్ళిపోయారు భయపడుతూ. ఒకామేమో నీళ్ళతోడి నిండిన బక్కెట్టు నీళ్ళతో అలానే కింద పెట్టేసి వెళ్ళిపోయింది గనగన వణుకుతూ.

ఆ వింటున్నతనికీ వింత వాతావరణం చూసి భయమేసింది.

'ఒరేయి బాబూ! యింటికి రారా! రమ్మంటుంటే' అని ఒకావిడ పిల్లాణ్ణావర్నో లాక్కుపోయి తపీమని తలుపులేసుకుంది. ధబీధబీమని తలుపు లేసుకుని, ఎవరి ప్రాణాలు వాళ్ళు అరచేతిలో పెట్టుకుని కొంచెం తెరచిన కిటికీల్లోంచి బిక్కుబిక్కుబిక్కుమని గుండె విబ్బరం చేసుకుని చూస్తున్నారు ఆడవాళ్ళు.

పెట్రోమాక్స్‌లైటు తీసివేసి గబగబా



...లోపలి పెట్టుకుని తలుపులేసుకున్నాడు సుబ్బయ్యశెట్టి.

నిముషంలో జిమ్మ చీకటయిపోయింది ఆ ప్రదేశమంతా!

'ఆ రంగడికీ యీ కొండడికీ . . యిందాకేదో చెప్పబోయావు?' అని పోలయ్య నడుగుతూ అతని పక్కనే గబగబా నడుస్తూ ఒక యింట్లోకి దూరారు.

'నెమ్మదిగా మాట్లాడు. నీకు సిటుక్కుమంటానికి వీల్లేదు లేకపోతే అక్కడ ప్రత్యక్షమయ్యాడన్న మాటే! ఒక విషయంలో రంగడు కొండడి కాలిరగ్గొట్టాడు యివాళొస్తున్నాడని తెలిసి బయిటికొచ్చుంటాడు. మాట్లాడకు. ఉష్! దగ్గరగా వస్తున్నాడు. యియి.కిటికీ!' అంటూ గొంతు తగ్గించివేసి, కిటికీ ఒక అంగుళం తెరచి యింట్లోదీపం చిన్నది చేసి వెలుగు బయటికి పోనీయకుండా చేశాడు.

వీధి దీపాల వెలుతురు గుడ్డిగా వుంది. పావురు కప్పల కీచుధ్వని స్పష్టంగా వినిపిస్తోంది. చెట్లు ఆకుగూడా గాలికి ఊగిగానీ, ఒకదానికొకటి రాచుకునిగానీ శబ్దం చేయటంలేదు.

విస్పష్టంగా ఒక నల్లని ఆకారం వూగుతూ, తూలుతూ కాళ్లీడ్చుకుంటూ వస్తూవుంది ఆ చీకటిలో అతని నల్లటి ఆకారం భయంకరంగా వుంది. దుబ్బుజుట్టు

# నా భార్య

సంస్కారం లేకుండా వుంగరాలు తిరిగి ముంగురులు మొహంమీదికి పడుతున్నాయి. నల్లటిమీసాలు భీకరంగా యమధర్మరాజుని మరిపిస్తున్నాయి. కట్టుకున్న లుంగీ గళ్ళ బనీను చీకటిలో కూడా వాటివీనాద చారలను మరుగు పరచలేక పోతున్నాయి.

ఆయాసంతోవచ్చే శ్వాసలు పాము బుసల్లాగా దూరానికి స్పష్టంగా వినిపిస్తున్నాయి. అతని చేతిలో బాకు దీపపు వెలుతురులో మెరుపులా మెరుస్తూ వుంది. దేహంతో బాటు చేతిలోని కత్తి వణుకుతూ వుంది. పట్టరాని ఆవేశం అతనిలో పొగలు గక్కుతుంది.

అడుగులు తడబడి పడుతుంటే కాలికి యేదోరాయి తగిలింది. దాన్ని ఒక తన్ను తన్నాడు. అది యెగిరి యెక్కడో పడి దొర్లుకుంటూ శబ్దం చేసింది. రక్తం కారుతున్నా లెక్కచెయ్యకుండా 'రారా! రా! నిన్నేం జేస్తానో యివాళ!' అని గట్టిగా అరిచాడు.

ఆ అరుపుకి దిక్కులు పిక్కటిల్లి నట్లయినాయి. తలుపులు బిగించుకుని యిళ్లల్లోవున్న వాళ్లగుండెలు ఝల్లు' మన్నాయి

ముందుకు పడుతూ, లేస్తూ నడుస్తున్నాడు. ఒక్కసారిగా నేల తాక్కుకుని మోకాళ్ళ మీద కూర్చుని ... యెత్తి నోరు తెరచి సీసాలోంచి రెండు గుటకలు గుటగుటా తాగాడు. గొంతు మండింది. ఆమంట చల్లారాలంటే యింకొంచెం తాగాలి. సీసా పెదాలకి కరచుకున్నాడు. సీసా ఖాళీ అయింది దూరంగా గిరాటువేశాడు సీసాని. 'ఠకేలు' మని పగిలి ముక్కలయిపోయింది.

'దాహం' గొంతుమంట! నాలుక పీక్కుపోతుంది. సోడాకావాలి!' సుబ్బయ్యశెట్టి కొట్టు తలుపుబాదాడు. తలుపు తీయలేదు. గట్టిగా కాలితో ఒక్కతన్ను తన్నాడు. గట్టి తలుపులు గాబట్టి శబ్దంచేసి వూరుకున్నాయి. లోపలి శెట్టికి పై ప్రాణాలు పైనే పోయినాయి. గట్టిగా పెళ్లాన్ని కావిలించుకున్నాడు. పెళ్లాం వణుకుతున్న మొగుడి నోరు గట్టిగా మూసింది.

అటూ యిటూ చూశాడు. రొప్పుకుంటూ కాలీడ్చుకుంటూ, బావిదగ్గర కెళ్లాడు. చేదలో నీళ్ళున్నాయి తోడుకోకుండా. చేదెత్తి గొంతులో పోసుకున్నాడు. గొంతునిండి నీళ్ళు పొర్లి బనీను తడిసిపోయింది మూతి తుడుచుకోనయినా లేదు.

అతనిలోవున్న మత్తు కొంచెం తగ్గింది. బీడీ వెలిగించాడు అగ్గిపెట్టె గీసినపుడు చీకటిలో అతనికళ్ళు ఎర్రదనంతో చింతనిప్పుల్లా నిగనిగలాడినాయి.

రచ్చబండమీద కూచున్నాడు. ఆయాసంగా. కడుపునిండా నీళ్లేగా! మత్తెక్కుతుంది మళ్లీ నెమ్మదిగా. కాని కళ్లల్లోవున్న చురుకుదనం మాత్రం చావలేదు. చిమ చిటుక్కుమన్న ధ్వనికూడా ఆలకిస్తూ వున్నాడు. 'వచ్చే... క్షేమయింది!' అని విస్పష్టంగా గొణుక్కున్నాడు.

కాలిక్రింద కుక్క లేచి నిలబడింది.

'ఛోయస్సే!' అంటూ కాలితో ఒక్క తన్ను తన్నాడు. దెబ్బతిని, మూలుక్కుంటూ వలొంచుకుని కళ్ళు పైకెత్తిచూసి దించుకుంటూ తోక ముడుచుకుని మునిగాళ్ళమీద బండవెనక్కు వెళ్లిపోయింది.

'వచ్చుంటాడు!' అని అనుకుని లేచి ముందుకు తూలుతూ నడక సాగించాడు. సందు మలుపు తిరిగాడు. అదేయిల్లు! అక్కడంతా చీకటిగా వుంది. కిటికీ కూడా తెరచిలేదు. 'అసలు రాలేదనుకుంటానింకా ఎందుకయినా మంచిదనుకుంటూ తలుపు



దగ్గరకెళ్ళి చూశాడు. తాళం వేసుంది. అక్కడే మూల కాలవ గట్టుమీద కాచుక్కూచున్నాడు.

చీకటి యెక్కువవుతున్న కొలదీ కీచురాళ్ళు మరింత ధ్వని చేస్తున్నాయి. నీలాకాశంలో నక్షత్రాలు మిలమిలలాడుతున్నాయి. కదలాడని చెట్టు ఆకు, ఏమాత్రం సద్దయినా స్పష్టంగా వినిపింప జేస్తుంది. చెవులు రిక్కించి, తీక్షణంగా అటూ యిటూ చూసి తల కదిలిస్తూ క్షణాలు లెక్కపెడుతున్నాడు.

'రామిగాణ్ణి యేదో అన్నానని యీనాడి కెందుకూ? నేనేదో మైకంలో వుంటే యీపని జేయిస్తావూ? రారా!' అంటూ పళ్ళు పటపటలాడించాడు

చిన్న శబ్దమయినా రంగడొస్తున్నాడనుకుని అటువైపు చూపులు పోరించాడు విశితంగా. కత్తి చేతిలో మెరుస్తున్నంతసేపూ అతనిలో ఆవేశం తగ్గదు. ఒళ్ళు తెలియని ఆవేశంతో వూగిపోతుంటే పట్టుదల యెలా వదుల్తాడు? మొండిగా అక్కడే కూచున్నాడు.

* * *

డొంక దగ్గరకొచ్చేసరికి జిమ్మచీకటి! కన్ను పొడుచుకున్నా కనుపించటం లేదు. చీకటిలో చెట్లు నల్లగా మరింత భయంకరంగా వున్నాయి.

'ఏమండీ?!' అంది ఆమె భయంగా అతని భుజంమీద చేయివేసి.

'ఒక్క ఫర్లాంగు. ఆ కనిపించేదే వూరు!' అన్నాడతను. భుజానికున్న హోండా బాగ్‌లోంచి టార్చితీసి లైటువేసి ముందుకు నడుస్తున్నాడతను ఒకచేతిలో పెట్టె వుంది. అతని భుజాన్ని పట్టుకుని అడుగులో అడుగువేసుకుంటూ, అతని భుజంమీదకి వాలుతూ పక్కగా నడుస్తుంది సునీత.

అతని ముఖంలో వెనకటి వుత్సాహం లేదు. యెందుకో అడుగులు తడబడుతున్నాయి. కాని, యేదో మొండిధైర్యం ముందుకు నడిపిస్తుంది.

గ్రామంలో అడుగుపెట్టారు. అప్పుడే ఎనిమిదింటికే నిర్మానుష్యంగా వుంది వూరంతా అనుమానంతో అడుగులు తడబడ్డాయి. చెట్టుమీద ఆకుతోబాటూ పిట్టయినా కదలడంలేదు. రచ్చబండ దగ్గరకొచ్చారు. టార్చి ఆర్పివేశాడు.

# ఆంధ్రసచిత్రవారపత్రిక

## 1968 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము. రచయితలందరూ ఎప్పటివలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

**మొదటి బహుమతి రు. 2100**

**రెండవ బహుమతి రు. 1500**

**మూడవ బహుమతి రు. 500**

## నిబంధనలు

1 కథలు స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచన అని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీరాసి పంపాలి. ఈ హామీలు వేరే కాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2 కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథలపోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకే వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు

4. కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేది 14—8—68. ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 25—10—68 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంప నవసరం లేదు.

9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యుల వారి
జీవామృతం
69 సంవత్సరములనుండి
ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు 17

పుస్తకములు
5 పుస్తకముల సెట్టు రు. 5-50
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS.
(WAT-7) Beat No 13, Aligarh.

రు. 20/-లకు ట్రాన్సిసర్
మా క్రొత్త పద్ధతిప్రకారం రు. 20/— లకే రు 330/-విలువ గల ఆల్వరల్డ్ 3 బ్యాండ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ను పొందండి. మీఆర్డరు నేడే వ్రాయండి

CEYLON TRADERS
(WAP-22)
Post Box 1257, DELHI-6

# రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

# నా భార్య

'ఏమండీ ?' అంటూ గట్టిగా అతని భుజం పట్టుకుంది భయంతో.

'పూళ్ళో కొచ్చేశాంగా ? భయందేనికి ?' అన్నాడు మళ్ళీ టార్చి వెలిగించి నవ్వుతూ చిన్నగా. ఎడమభుజం అదిరింది.

సందు మలుపు తిరిగారు.

'రంగా!' అంటూ భయంకరంగా అరచి కత్తితో ఎదటుగా దూకాడు కొండడు

అతనికి ముచ్చెమటలు పోశాయి ఒక్కసారిగా ఒళ్ళంతా చల్లబడి పోయింది. ఆ భయంకరవ్యక్తిని చూచి ఆమె అతని భుజానికి కరుచుకు పోయింది టార్చి ఎప్పుడు పడిపోయిందో తెలియదు దొర్లుకుంటూ కాలవలో పడిపోయింది ట్రంకు చేతిలోనుండి జారిపడిన శబ్దంతో స్పృహలోకి వచ్చాడు రంగనాథం

క్షణంలో ఘోర అంధకార బంధురం అలుముకుంది !

'ఏరా మొగాడో! ఆడదాన్ని ఎనకేసుకొచ్చావేరా ? తీయ్ కత్తి!' అంటూ గంభీరంగా గర్జించాడు

రంగడి దగ్గిరకూడా పూళ్ళో వున్నప్పుడెప్పుడూ కత్తివుండేది మొల్లో యిదివరకు.

'తీయరా ! అంటుంటే !' అంటూ మీదికి చెయ్యి విసరి కత్తితో బెదిరించాడు

'లేదు !' అన్నాడు భయపడుతూ రంగనాథం.

'పిరికోడా! చావంటే ఎందుకురా భయం తియ్యరా అంటుంటే, యివ్వాళ నువ్వో, నేనో అటో యిటో తేలిపోవాలి !' అని హూంకరించాడు.

మొండి ధైర్యం తెచ్చుకున్నాడు రంగనాథం. 'చావంటే ఎవడురా భయపడేది. యెన్నిసార్లు తెగించలేదు ఈ రంగడంటే చచ్చు పీనుగను కున్నావా? కానీ...యిప్పుడు.'

'ఇప్పుడేమయింది? గాజులేయించుకున్నావా?' అంటూ కోపంగా అరిచాడు పిచ్చిగా.

ఆమె మరింత భుజాని కరుచుకు పోయింది.

'కొండా! నేను పెళ్ళి చేసుకున్నానురా!'

'ఏ పెళ్ళెవడిక్కావాలి? ముందు తియ్యి కత్తి. లేకపోతే ఒగ్గామంటావా? యిదిగో!' అంటూ బొడ్లోంచి తీసి క్రింద వేశాడేదో. చీకటిలోకూడా ధళధళలాడుతూ మెరిసింది!

'యెత్తు!' అంటూ వురిమాడు.

వెనుకనున్న ఆమె గడగడ వణికింది!

రంగడు నెమ్మదిగా తీశాడు దాన్ని. అటూ యిటూ తిప్పి చూశాడు 'హింసను అహింసతో జయించమన్నారు గాంధిజీ!' జ్ఞాపకానికి వచ్చింది. నవ్వుతూ నెమ్మదిగా నేలమీదకు వదిలి వేశాడు.

'రంగా!' అంటూ గట్టిగా అరచి ఘూర్ణిల్లుతున్న కోపంతో వూగిపోతూ వుంటే, కొండడి కంటినుండి విస్ఫులింగాలు వెదజల్లుతున్నట్లున్నాయి.

నిశ్చింతగా నవ్వి, అతని కళ్ళల్లోకి చూస్తూ, 'కొండా! నీకు కావల్సింది నా ప్రాణమేగా. తీసుకోరా నీలా పిరికి చావు చావకుండా హాయిగా నాభార్య ఒళ్ళో చచ్చిపోతాను!' అన్నాడు రంగనాథం

ఆమాటతో అతని మస్తిష్కంలోని మత్తు దిగిపోయింది. హృదయం ఆవేగంగా కొట్టుకోవారంభించింది 'తన మనస్సెటో పొంగి పొరలిపోతూ వుంది. అవతలి అంచు తను చేరటం కష్టం!...యేదీ తనకేదీ. యేదీ? శూన్యం అంతా నిరామయం! చేజేతులా చేసుకున్న తను' అతని బుర్ర తిరిగింది. 'లేదూ! తనకు లేదూ!' అతనిలో ప్రక్రోషమో, ఆవేశమో ప్రవేశించింది.

'అయితే యెవరీ అమ్మాయి?' అంటూ కత్తి సూటిగా ఆమె మోహం మీదపెట్టి అడిగాడు కొండడు.

బెదరిపోయిన గుండె ఆగిపోతున్నట్టనిపించిందామెకు. గట్టిగా రంగనాథాన్ని కౌగలించుకుని అతని వెనుక దాక్కుంది భయంతో.

'నాభార్య! నేను పెళ్లిచేసుకున్నాను!'

'నా భార్య!' నెమ్మదిగా గొణుక్కున్నాడు కొండడు

కత్తి వెనక్కు తీశాడు నెమ్మదిగా తల వంచుకున్నాడు. తలెత్తి ఆమె వంక చూశాడు. భయభ్రాంతమై గడగడ వణుకుతూ వుంది. ముంగురులు చెదిరి జారి నుదుటి బొట్టుమీద జీరాడుతున్నాయి. చిరు చెమటల్లో ఎర్రటి సింధూరం చెదరిపోతున్నట్లు కన్పించింది. పాలుగారు బుగ్గలమీద కన్నీటి చారికలు చీకటిలో స్పష్టంగా కన్పించినాయి.

'నా భార్య!' యింకా నెమ్మదిగా తనలో తను అనుకున్నాడు.

ఆవేశం మాయమయింది. కనుపించే పవిత్రత హృదయవేగావ్నాపింది. మన స్నేక్కడికో తెలియని దివ్యలోకాల్లోకి పరు వెత్తింది. కళ్లు రెప్పలార్పకుండా బాధతో ఆకాశం వంక చూశాడు. నీలాకాశంలో తారలు మినుకు మినుకు మంటున్నాయి నిర్మలంగా, నిండుగానూ !

ఎప్పుడు వదిలాడో, నెమ్మదిగా ఆ కత్తి పక్కడే జార వదిలి, తడబడే అడుగులుతో, వినీలాకాశం వంక మోర యెత్తి చూసు కుంటూ, 'నా భార్య', 'నా భార్య', 'నా భార్య,' అని నెమ్మదిగా అనుకుంటూ, తలచుకుంటూ, ఏదో స్వరూపాన్ని మలచు కుంటూ, వెనుదిరగకుండా తిన్నగా వెళ్లి పోయాడు చీకటిలో కలిసిపోయాడు.


నిశ్చేష్టయ్యై నిలిచి వెళ్తున్న అతని వంకే చూస్తున్న భార్యనుచూసి 'సునీ !' అని చేతితో తట్టాడు రంగనాథం.

నిలువరించుకోలేని నీటిబొట్లు నాలుగు ఆమె కంటినుండి జలజలా ఆమె చెక్కిళ్ల మీదనుండి రాలినాయి !

నిర్ఘాంతపోయి, 'ఏమిటి సునీ?' అని అతను అడుగుతూవుంటే, మాటల్లో వ్యూహల్ని చెప్పలేని ఆమె ఏం చెప్పతుంది 'ఏమీ లేనట్లు' చిరునవ్వు చిందిస్తూ అతని ఒడిలో ఒదిగి మొహం దాచుకుంది.

నెమ్మదిగా ఆమె తలదువ్వుతూ, కొండడి భార్య అన్నపూర్ణ చాలా అందంగా వుండేది భార్యతో చాలా ప్రేమగా వుండే వాడు. పుట్టింట దగ్గర్నుండి చాలా ఆస్తి తెచ్చింది. కానీ తాగి తందనాలాడితే, నీరా జనంలా నీరయి కరిగి పోయింది. ఆమె కూలీ, నాలీ చేసి కూడు బెట్టేది తాగడానికి డబ్బు లివ్వటంలేదని అన్నేవాడు. పాపం ! ఆ యిల్లాలు చిక్కి శల్యమై మంచానబడిం తర్వాతగానీ భార్య విలువ గుర్తించుకోలేక పోయాడు కానీ, యింతలోనే ఆమెకు స్వర్గాన్నుండి పిలుపు వచ్చేసింది పోతూ, పోతూ, 'ఆడదాని కన్నీరు మగాడికి జయం గాదు' అని చెప్పింది.

'నా భార్య' అని వేసవగానే అన్న పూర్ణ కంటికి కనుపించిందనుకుంటాను. అందుకే వివర్ణమై, నిర్వేదనగా వెళ్లి పోయాడు—' అని చెప్పాడు రంగనాథం, అన్నపూర్ణని తన చూపుల్లోకి తెచ్చు కుంటూ ●




ఈ జంతువు ఆకారం నక్షత్రంలా ఉండటంవల్ల దీనికి ఆపేరు వచ్చింది. ఇంగ్లీషులో దీన్ని 'స్టార్ ఫిష్' అంటారు. కాని నిజానికిది చేపకాదు దానికి సాధారణంగా ఐదు 'చేతులు' ఉంటాయి అయితే ప్రతిచేతికి వందలాది, 'పాదాలు' ఉంటాయి. ఈ పాదాలకి పట్టు విడుపు శక్తి పొడవవడం, పొట్టి అవడం లక్షణం ఉండడంవల్ల, వాటిసహాయంతో నెమ్మదిగా సాగుతుంది.

సముద్రం అడుగున, రాళ్ల మీద సాధారణంగా ఇది సంచరిస్తుంది. మాంసాహారి కావడమే కాక నక్షత్రం పురుగు విపరీతంగా తింటుంది. ముఖ్యంగా ముత్యపు చిప్పల పురుగులకి, ఈ నక్షత్రం పురుగు నష్టం కల్గిస్తుంది. ఆల్చిప్ప పురుగులలాటి వీటిని తెరచడానికి మనకే మామూలుగా కష్టం. అలాటిదాని రెండు ప్రక్కలా తన పాదాలను అతికించి, క్రమంగా బలవంతంగా తెరిపిస్తుంది. ఆ తరవాత తన శరీరం లోని జీర్ణాశయాన్నే, బయటకు నెట్టివేస్తుంది. మృదువు సున్నితం అయిన ముత్యంచిప్ప పురుగువి శరీరం బయట జీర్ణం చేసు కొంటుంది. జీర్ణక్రియ అయ్యాక, తన జీర్ణాశయాన్ని తిరిగి లోపలికి లాక్కుంటుంది !

నక్షత్రం పురుగు శరీరం పయిన చిన్నచిన్న పలకలు (కడపరాళ్ల లాగా) అతికి బయట ఒక కవచం ఏర్పరుస్తాయి. వాటికే ముళ్లు అతికి ఉంటాయి. అంతేకాక చిలక ముక్కుల్లాగా కొన్ని అవయవా లుంటాయి. పైన ఏదైనా పడితే ఒకటి అందుకొంటుంది. ఒకటికి ఒకటి మరొకటి అందించుకొని చివరగా క్రిందకు పడవేస్తాయి. అలా శరీరం శుభ్రంగా ఉంచు కొంటాయి !

—జమ్మి కోనేటిరావు